సాక్షి తిరుపతి

సోమవారం । 17 । జూన్ । 2024



అలరించిన 'దుర్యోధన వధ'

ఏర్పేడు మండలం పాతవీరాపురంలో వైభవంగా శ్రీధర్మరాజస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. - 8లో



'కోన'.. కనువిందు

నారాయణవనం సమీపంలోని కైలాసనాథకోన పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తోంది. - 8లో



ఎస్వీయూలో పదవుల కోసం..

ఎస్వీ యూనివర్సిటీలో వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ పదవుల కోసం ఆశావహులు ముమ్మరంగా పైరవీలు ప్రారంభించారు. - 8లో

న్యూస్‌రీల్

త్యాగానికి ప్రతీక బక్రీద్





ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి





శ్రీనివాసులు ప్రవీణ్‌కుమార్ షణ్మోహన్

పుంగనూరు/తిరుపతి అర్బన్/చిత్తూరు కార్పొరేషన్ : త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ బక్రీద్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మైనారిటీలకు ఎల్లప్పుడూ తాము అండగా ఉంటామన్నారు. బక్రీద్ పండుగను జరుపుకునే ముస్లింలందరికీ జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ మత సామరస్యంతో బక్రీద్ పర్వదినాన్ని నిర్వహించుకోవాలని కోరారు. తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ పెంచలకిషోర్, ఇతర ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రశాంత వాతావరణంలో పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

పల్లికొండేశ్వరుని సేవలో మేఘాలయ హైకోర్టు సీజే



జస్టిస్ వైద్యనాథన్‌కు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకుడు

నాగలాపురం : సురుటపల్లెలో వెలసిన సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి వారిని ఆదివారం మేఘాలయ హైకోర్టు చీఫ్ జస్టిస్ వైద్యనాథన్ సేవించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

పకడ్బందీగా 'నేను బడికి పోతా'

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు రూపొందించిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని జూలై 12వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బడిఈడు పిల్లలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయసు గల బాలలందరు పాఠశాలల్లో ఉండేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. బడి మానేసిన పిల్లలతో సీఆర్‌పీలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసెస్టెంట్లు సమావేశం నిర్వహించి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నారు. ఇందు కోసం క్షేత్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి, ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టాలని అధికారులు దిశానిర్దేశం చేస్తున్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

తిరుపతి అర్బన్ : యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలను ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9:30 నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 4:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరిగినట్లు వెల్లడించారు. తిరుపతిలోని 11 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షలకు 5,518 మంది అభ్యర్థులకుగాను ఉదయం 2,728 మంది 49.44 శాతం, మధ్యాహ్నం 2,721 మంది 49.31 శాతం హాజరైనట్లు వివరించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా పరీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించలేదని స్పష్టం చేశారు.



● భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ముస్లింలు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు మసీదులు, ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే విశిష్ట పర్వదినం రోజు దానధర్మాలు చేసేందుకు సన్నాహాలు చేసుకున్నారు. మత సామరస్యంతో ఇస్లాం పవిత్రతను చాటేందుకు సిద్ధమయ్యారు.

– తిరుపతి కల్చరల్

● బాధ్యతల స్వీకరణ

టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కలియుగ వైకుంఠంలో విధులు నిర్వర్తించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం క్యూలను, అన్నప్రసాద వితరణ కేంద్రాలను తనిఖీ చేశారు. భక్తులకు పకడ్బందీగా వసతులు కల్పించాలని ఆదేశించారు.

– తిరుమల



వేధిస్తూ.. కక్ష సాధిస్తూ..!

అధికారం మత్తు తలకెక్కిన కూటమి నేతలు ఆటవిక న్యాయం అమలు చేస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ శ్రేణులే లక్ష్యంగా దాడులు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచిన సామాన్యులను సైతం వేధిస్తున్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన కట్టడాలను ఇష్టారాజ్యంగా పడగొట్టేస్తున్నారు. నిరుపేదలకు పంపిణీ చేసిన స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. ఆక్రమణల పేరుతో రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులను నిలువునా కూలదోస్తున్నారు. తమకు అనుకూలంగా పనిచేయని అధికారులపై కక్ష సాధిస్తున్నారు. చివరకు ప్రజాప్రతినిధులు సైతం తమ నియోజకవర్గాల్లో స్వేచ్ఛగా తిరగలేని దుస్థితి కల్పిస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై యథేచ్ఛగా కూటమి నేతల దాడులు
- నిజాయితీగా పనిచేసే అధికారులపైనా ఒత్తిళ్లు
- సెలవు పెట్టి వెళ్లిపోవాలని బెదిరింపులు
- అనుకూలంగా లేని వారికి పోస్టింగ్ ఇవ్వొద్దని హెచ్చరికలు
- పచ్చమూక పైత్యానికి నేలమట్టమవుతున్న ప్రభుత్వ ఆస్తులు
- పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలు.. భూముల స్వాధీనానికి యత్నాలు



గుండ్లకంద్రిగలో సర్వే రాళ్లు తొలగిస్తున్న అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కూటమి నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కౌంటింగ్ ముగిసిన రోజు నుంచి రెచ్చిపోతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హుందాగా వ్యవహరించాల్సింది పోయి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ఆ పార్టీకి ఓటేసిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. ప్రత్యర్థి పార్టీ ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనడం కూడా తప్పే అన్నట్లు దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను సైతం ధ్వంసం చేస్తున్నారు. అడ్డొచ్చిన వారిపై కర్రలు, రాళ్లతో దాడులు చేస్తున్నారు. ఈక్రమంలోనే శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం గుండ్లకంద్రిగలో రైతు భరోసా కేంద్రం చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడను టీడీపీ శ్రేణులు ఆదివారం ఉదయం జేసీబీతో కూలదోశారు. సుమారు 50 సెంట్ల స్థలంలోని ఆర్‌బీకే చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. అందులో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పంట ఉత్పత్తులు నిల్వచేసుకునేందుకు గోదాములు నిర్మించేందుకు గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అందులో భాగంగా పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో స్థలం అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు అధికారుల అనుమతులతో సుమారు రూ.5లక్షలు వెచ్చించి ప్రహరీ గోడ నిర్మించారు. సర్పంచ్ వెచ్చించిన బిల్లు కూడా ఇంకా మంజూరు కూడా కాలేదు. ఆ ప్రభుత్వ స్థలంపై కన్నేసిన టీడీపీ నాయకులు ప్రహరీ గోడను కూల్చేశారు.



రాజీవ్‌నగర్‌లో ఓ పేదవాడి కలల సౌధం ధ్వంసమవుతున్న దృశ్యం

సెలవుపై వెళ్లిపోండంటూ హుకుం

జిల్లాలోని అధికారులపై సైతం కూటమి నేతలు కక్ష సాధింపు చర్యలకు దిగారు. ప్రభుత్వం మారిన వెంటనే డిప్యుటేషన్‌పై వచ్చిన వారిని బదిలీ చేయడం సర్వసాధారణం. అలాగే ఒకే చోట మూడేళ్లకు పైగా విధులు నిర్వర్తించిన వారిని కూడా బదిలీ చేస్తుంటారు. ఇందుకు విరుద్ధంగా నిజాయితీగా పనిచేస్తున్న అధికారులను సైతం కూటమి నేతలు వేధిస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా వ్యవహరించారంటూ అభియోగాలు మోపి పనిగట్టుకుని బదిలీ చేయించేందుకు యత్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం బదిలీకి అవకాశం లేని వారిని సెలవు పెట్టి వెళ్లిపోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. వారికి పోస్టింగ్ సైతం ఇవ్వొద్దంటూ మౌఖికంగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఉన్నతాధికారులు, పోలీసులు, సచివాలయ ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలకు పూనుకున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ వెంట నడిచిన ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులను సైతం ఎక్కడికక్కడ వేధిస్తున్నారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆయా కంపెనీల యాజమాన్యాలకు అల్టిమేటం జారీ చేస్తున్నారు.



రాజీవ్ నగర్‌లో పక్కా ఇంటిని కూలదోస్తున్న దృశ్యం

రూ.5 కోట్ల విలువైన భవనాలు ధ్వంసం

శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన పునాదులను శనివారం తొలగించారు. అయితే భవనాలకు కొంత సమయం ఇస్తే షట్టర్లు, వస్తువులు తరలించుకుంటామని బాధితులు ప్రాధేయపడ్డారు. అవేమీ పట్టించుకోకుండా సెలవు దినం అయిన ఆదివారం సీఆర్‌పీఎఫ్, పోలీసులను రక్షణగా పెట్టుకుని రెవెన్యూ అధికారులు రూ.5 కోట్ల విలువైన భవనాలను కూల్చివేశారు. అధికారుల కాళ్లు పట్టుకుని బాధితులు లబోదిబోమన్నా కనికరించలేదు. జేసీబీలను తీసుకొచ్చి భవనాలను కూల్చివేశారు. రోడ్డు పోరంబోకు, కాలువ పోరంబోకు పేరుతో కూలదోశారు. ప్రభుత్వానికి ఏదైనా సొమ్ము చెల్లిస్తామన్నప్పటికీ బాధితుల గోడు పట్టించుకోలేదు. టీడీపీ వచ్చిన పదిరోజులకే ఇంతటి అరాచకాలకు దిగడం బాధాకరమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయం చెరువులోనే ఉందని, దానిని తొలగిస్తారా..? అంటూ అధికారులను నిలదీశారు. రాజకీయాలంటే ఎన్నికల వరకే పెట్టుకోవాలని, ఈ విధంగా విధ్వంసం చేయడం మంచిది కాదని మండిపడ్డారు.

నియోజకవర్గంలో తిరగనివ్వకుండా..

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టీడీపీ నేతలు టార్గెట్ చేసుకున్నారు. శనివారం పుంగనూరులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తమ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మూక రెచ్చిపోయింది. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళనకు దిగింది. పుంగనూరులోకి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రావడానికి వీలులేదంటూ అప్రజాస్వామికంగా వ్యవహరించింది. ఇదే క్రమంలోనే పుంగనూరు పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేత, పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ ఇంటిపై దాడికి తెగబడింది. సుమారు 70 మంది మూకుమ్మడిగా ఇంట్లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. అడ్డువచ్చిన వారిపై దాడి చేసి గాయపరిచారు.



మొండి గోడలతో ఇల్లు

కొనసాగుతున్న విధ్వంసాలు



శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లో పోలీసుల సమక్షంలోనే విధ్వంసం

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకుల నివాసాలు, వైఎస్సార్ విగ్రహాలు, ఆ పార్టీ కార్యాలయాలు, దిమ్మెలను కూలదోశారు. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ ప్రాంతంలో ఎంజాయ్‌మెంట్ పట్టాలు పొందిన వారు నిర్మించుకున్నవి, నిర్మించుకుంటున్న వాటిని ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూలదోశారు. రెండు రోజులుగా సాగుతున్న ఈ కూల్చివేతలతో శ్రీకాళహస్తిలోని జనం బెంబేలెత్తిపోతున్నారు. రాజీవ్ నగర్ కాలనీలో శనివారం చేపట్టిన కూల్చివేతలు.. ఆదివారం కూడా కొనసాగాయి. రెండో రోజు ఆదివారం ఏకంగా 30 నిర్మాణాలు కూల్చివేశారు. 14 నివాస గృహాలు, సగం పూర్తయినవి మరో ఐదు, ఇంకో 15 పునాదుల స్థాయిలో ఉన్న నిర్మాణాలు నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. ఎందుకు కూల్చారు అంటే.. అక్రమ నిర్మాణాలు అని అధికారులు చెబుతున్నారు. గూడు లేని అనేక మంది రూ.లక్షలు అప్పు చేసి నిర్మించుకుని నివాసం ఉంటున్న వాటిని కూల్చివేయడంపై బాధితులు ఆందోళన చేస్తున్నారు. ఇంటి స్థలాలు లేకపోవడంతో నాడు అధికారులు, నాయకుల కాళ్లావేళా పడితే.. దయదలచి స్థలాలు కేటాయించారని, వాటిలో నిర్మాణాలు చేపట్టి నివాసాలు కూడా ఉంటున్నామని చెబుతున్నారు. ఆక్రమణలే అయితే విద్యుత్ మీటర్లు ఎలా ఇస్తారు? అని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కూలదోసిన వాటికి సంబంధించి విచారణ చేపట్టి, వారి వారి కుటుంబ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని కోరుతున్నారు. ఇలా మరిన్ని నిర్మాణాలను కూల్చివేసి ఆక్రమించుకునేందుకు టీడీపీ నాయకులు రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. జగనన్న లేవుట్లలో కేటాయించిన స్థలాల్లో ఎవరైనా నిర్మాణాలు చేపట్టకుండా ఉంటే.. వాటిని కూడా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అలా స్వాధీనం చేసుకున్న స్థలాలను తమ వారికి కట్టబెట్టేందుకు టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు రంగం సిద్ధం చేస్తున్నారు.



రాజీవ్‌నగర్‌లో నిర్దాక్షిణ్యంగా నిర్మాణాల కూల్చివేత

ఆదరించిన ప్రజలకు అభినందనలు



పార్టీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ : సార్వత్రిక ఎన్నికల్లో ఆదరించి గెలిపించిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతాభినందనలని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని పల్లమాల గ్రామంలో సత్యవేడు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రూ.కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టామన్నారు. అయినప్పటికీ ఎన్నికల్లో పార్టీ ఓటమిని ఊహించలేదని, ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామని వెల్లడించారు. నిత్యం ప్రజల వెంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పోరాటం చేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నూకతోటి రాజేష్ మాట్లాడుతూ ఎన్నికలకు 60 రోజుల ముందు సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్తగా అధినేత జగనన్న నియమించారని, తక్కువ రోజుల్లోనే ప్రజలు, పార్టీ శ్రేణులు గొప్పగా ఆదరించారని తెలిపారు. స్వల్ప తేడాతో ఓటమి చెందినా, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని వెల్లడించారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ వేలూరు రాకేష్, ఎంపీపీ మేకల సుబ్బరత్నమ్మ, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్‌రెడ్డి, సాయి నాయుడు, గురునాథం, గెడిటో ట్టిగురవయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, జయచంద్రనాయుడు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాగూర్, కత్తి సురేష్, ప్రసాద్, మునిరత్నంనాయుడు, తిరుపాల్, సుబ్రమణ్యంయాదవ్, మోహన్, బాలయ్య పాల్గొన్నారు.

మామిడి ధరలపై సమీక్ష

తిరుపతి అర్బన్ : మామిడి ధరలపై కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఉద్యానశాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 52 వేల ఎకరాల్లో మామిడి సాగు చేశారని చెప్పారు. సాధారణంగా ఎకరానికి 4 నుంచి 6 టన్నుల దిగుబడి వచ్చేదని, అయితే ఈ ఏడాది కేవలం 2 టన్నులు మాత్రమే వచ్చిందని వెల్లడించారు. పెట్టుబడులు మాత్రం తగ్గకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో తోతాపురి రకం మామిడి టన్నుకు రూ.30వేలకు తగ్గకుండా రైతులకు అందించాలని సూచించారు. మామిడి వ్యాపారులు రూ.30వేలకు మించి కొనుగోలు చేయాలని కోరారు. తక్కువ ధరకు కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐఐటీ తిరుపతిలో 'ఓపెన్ హౌస్'



మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు : మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఆదివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో అడ్మిషన్ పొందితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్–2024లో అర్హత సాధించిన విద్యార్థులు ఐఐటీలో అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అనంతరం ఇన్‌స్టిట్యూట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అకడమిక్స్, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ, ప్లేస్‌మెంట్స్, ప్రోగ్రామ్‌లు, క్యాంపస్ అభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఓపెన్ హౌస్ సెషన్స్‌కు 60 మంది విద్యార్థులు వ్యక్తిగతంగా, 120 మంది ఆన్‌లైన్ ద్వారా హాజరైనట్లు డైరెక్టర్ వెల్లడించారు. అనంతరం ఐఐటీలోని ల్యాబ్‌లు, తరగతి గదులు, హాస్టల్, భోజన వసతి సౌకర్యాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు చూపించారు.

క్లుప్తంగా

అలరించిన 'దుర్యోధన వధ'



భీముడు, ధుర్యోధన వేషధారుల సంవాదం

ఏర్పేడు : మండలంలోని పాతవీరాపురంలో వైభవంగా శ్రీధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ప్రదర్శించిన దుర్యోధన వధ నాటకం అలరించింది. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద మట్టితో భీముడు, దుర్యోధనుడి ప్రతిమలను ఏర్పాటు చేశారు. ఆలయం నుంచి పోతురాజుతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. భీముడు, ధుర్యోధనుడి వేషధారులు పద్యాలు పాడుతూ యుద్ధ ఘట్టం ప్రదర్శించారు. భీముడి వేషధారి గదతో దుర్యోధనుడి తొడపై కొట్టడంతో నాటకం పరిసమాప్తమైంది. అనంతరం దుర్యోధనుడి ప్రతిమ డొక్కలో పిండ ప్రదానం చేశారు. డొక్కలో ఉంచిన ఆహారాన్ని సంతా నంలేని మహిళలకు అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, ఆలయ పూజారి రవి పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ : డ్రైవర్ మృతి

తొట్టంబేడు : మండలంలోని లింగమనాయుడు పల్లె వద్ద శనివారం రాత్రి రెండు లారీలు ఢీకొనడంతో ఓ డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ షాకీర్ ఆలీ(24) అరక్కోణం నుంచి ఎంఆర్ఎఫ్ టైర్స్ లోడ్‌తో పంజాబ్ వెళుతున్నాడు. లింగమనాయుడుపల్లె వద్ద ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి లారీతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో షాకీర్ ఆలీ తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'కోన'..కనువిందు

పక్షులు కిలకిలరావాలు.. చల్లటి పిల్లగాలులు.. ఆకాశాన్నంటే వృక్షాలు.. నిరంతరం జాలువారే జలధారలు.. కనువిందు చేసే ప్రకృతి సోయగాలు.. కైలాసనాథకోన సొంతం. సూర్యరశ్మి సైతం నేలను తాకనివ్వని ఎత్తయిన కొండల నడుమ ఈ క్షేత్రం విరాజిల్లుతోంది. సుమారు 120 అడుగుల ఎత్తు నుంచి కిందకు ఉరికే జలపాతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. రమణీయ సొబగుల మధ్య కొలువైన కైలాసనాథస్వామి సన్నిధి సందర్శకులకు ఆధ్యాత్మికానుభూతిని పంచుతోంది.



కంచి మఠం

- పర్యాటక కేంద్రంగా కైలాసనాథకోన
- సందర్శకులను ఆకట్టుకుంటున్న జలపాతం
- నిరంతర జలధార సమీపంలో కొలువైన కైలాసనాథస్వామి
- కట్టిపడేస్తున్న ప్రకృతి సొబగులు

నారాయణవనం : పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రంగా కైలాసనాథకోన విలసిల్లుతోంది. నారాయణవనానికి 5 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా పెద్దసంఖ్యలో సందర్శకులు ఇక్కడికి తరలివస్తుంటారు. ముఖ్యమంగా సెలవు రోజుల్లో వేలాదిమంది పర్యాటలకు కైలాసనాథకోనలో సేద తీరేందుకు విచ్చేస్తుంటారు. ఇక్కడి ప్రకృతి అందాలను వీక్షించి మైమరచిపోతుంటారు.

శివుడు పరవశించిన జలపాతం

నారాయణవనంలో శ్రీవెంకటేశ్వర స్వామి, పద్మావతీదేవి కల్యాణమహోత్సవానికి తరలివచ్చిన పరమశివుడు ఇక్కడి జలపాతంలో స్నానమాచరించి పరవశించాడని, , తన్మయత్వంతో ధ్యానం చేశాడని వరాహ పురాణం పేర్కొంటోంది. అందుకే ఈ ప్రాంతానికి కైలాసనాథకోనగా పేరు వచ్చిందని వెల్లడిస్తోంది. ప్రతి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు కోనకు తరలివస్తుంటారు. కామాక్షాంభికా సమేత శ్రీకైలాసనాథస్వామివారిని సేవించుకుని మొక్కులు చెల్లించుకుంటుంటారు. శరన్నవరాత్రులు, మహాశివరాత్రి, కార్తీక మాసంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తుంటారు.

పౌర్ణమికి ఆకాశ దీపం


మాసశివరాత్రితోపాటు పౌర్ణమి రోజుల్లో కైలాసనాథునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపిస్తుంటారు, ప్రతి పౌర్ణమి రోజును కైలాసనాథకోన శిఖర భాగమైన ముక్కు కొండపై ఆకాశ దీపం వెలిగిస్తుంటారు.



కైలాసనాథస్వామివారు



కైలాసనాథకోన జలపాతం



జలపాతానికి వెళ్లే మెట్ల దారి

చేరుకోవడం ఇలా..

పుత్తూరు నుంచి నాగలాపురం మార్గంలో నారాయణవనం నుంచి 4 కిలోమీటర్ల దూరంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ వరకు ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి 2 కిలోమీటర్ల మేర నడక దారిలో కోనకు చేరుకోవచ్చు. వాహనాలపై వెళ్లే వారు అరణ్యకంకండ్రిగ వద్ద కోన క్రాస్ నుంచి రోడ్డుమార్గంలో 2 కిలోమీటర్లు ప్రయాణించి కైలాసనాథకోనకు వెళ్లవచ్చు.

అందుబాటులో సౌకర్యాలు

కైలాసనాథకోనలో ఏపీ టూరిజం వారి హరిత రిసార్ట్ అందుబాటులో ఉంది. ఏసీ, నాన్ ఏసీ రూమ్‌లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. అలాగే కోనకు 2 కిలోమీటర్ల దూరంలో ఈశ్వర ఎస్టీ కాలనీ సమీపంలో పదుల సంఖ్యలో ప్రైవేట్ రిసార్టులు ఉన్నాయి. ఆధ్యాత్మిక చింతనతో తరలివచ్చే వారికి కంచిమఠం, శివశక్తి ఆశ్రమం, శాంతి ఆశ్రమం, అర్ధనారీశ్వర ఆశ్రమాలు విడిది వసతిని కల్పిస్తాయి. పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఆశ్రమాలలో భక్తులకు అన్నప్రసాదాల వితరణ సైతం ఉంటుంది.



ఏపీ టూరిజం హరిత రిసార్ట్

అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



కైలాసనాథకోన అభివద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాం. దాతల ప్రోత్సాహంతో ఆలయంలో పలు పనులు చేపట్టాం. తుడా సహకారంతో కొన్ని ప్రతిపాదిత పనులను పూర్తి చేస్తాం. కోనలోని జలపాతం, ఆలయ మెట్లు పునరుద్ధరించాలని సంకల్పించాం. కోన అభివద్ధికి కమిటీ విశేషంగా కృషి చేస్తోంది.

– బత్తల భాస్కర్, కైలాసనాథకోన అభివృద్ధి కమిటీ సభ్యుడు

కల్యాణ వెంకన్న సేవకు సర్వభూపాల వాహనం



దాతలు అందించిన వాహనం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి అజ్ఞాత దాతలు ఆదివారం సర్వభూపాల వాహనం అందజేశారు. బంగారు తాపడంతో చేయించి ఈ వాహనాన్ని శ్రీవారి సేవకు వినియోగించాలని దాతలు కోరారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు అందించారు.

ఎస్వీయూలో పదవుల కోసం పైరవీలు

తిరుపతి సిటీ : నూతన ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఎస్వీయూలో పదవుల కోసం ఆశవహుల పైరవీలు మొదలయ్యాయి. ప్రతి విభాగంలోనూ చిన్న ఉద్యోగి నుంచి ప్రొఫెసర్ల వరకు నిత్యం వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ పదవులపైనే చర్చించుకుంటున్నారు. సామాజిక వర్గ సమీకరణాల ప్రాతిపదికనే పదవులను భర్తీ చేస్తారనే వార్తలు వర్సిటీలో చక్కర్లు కొడుతున్నాయి. రిజిస్ట్రార్ పదవికి మహ్మద్ హుస్సేన్ రాజీనామా చేయగా, రెక్టార్ పదవి గత కొంత కాలంగా ఖాళీగా ఉండటంతో ఆశావాహులు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ దృష్టిలో పడేందుకు పలువురు ప్రొఫెసర్లు విజయవాడకు క్యూకట్టారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి, మంత్రి, స్థాయిలో పరిచయమున్న, స్థానిక నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. నేడో, రేపో రిజిస్ట్రార్, రెక్టార్ పదవులను భర్తీ చేస్తారనే సమాచారం రావడంతో ఎవరికి వారు తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన మహిళా ప్రొఫెసర్, ఇంజినీరింగ్ కళాశాల సీనియర్ ప్రొఫెసర్, డీడీఈలోని మరో ఇద్దరు ప్రొఫెసర్లు ఇప్పటికే ముందంజలో ఉన్నట్లు తెలిసింది. వీరితో పాటు జాగ్రఫీ, కామర్స్ విభాగాలలో పనిచేస్తున్న సీనియర్లు సైతం తమ వంత ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

అధికారం అడ్డుపెట్టుకుని ఆక్రమణ

- మఠం భూమి కబ్జాకు టీడీపీ నేత యత్నం
- జేసీబీతో నిర్మాణాల కూల్చివేతకు సన్నద్ధం



మఠం భూమిలోని దుకాణాల ముందు ధ్వంసం చేయించిన టీడీపీ నేత

తిరుపతి మంగళం : అత్యంత విలువైన హథీరామ్‌జీ మఠం భూమిపై టీడీపీ నేత కన్నేశాడు. ఇప్పటికే ఈ భూమిని ఆక్రమించిన స్థానికుడితో వివాదానికి దిగాడు. వివరాలు.. తిరుపతి నగరం తిమ్మినాయుడుపాళెం లెక్క దాఖలు సర్వే నంబర్ 81/1లో 1.44 ఎకరాల హథీరాంజీ మఠం భూమి ఉంది. మూడేళ్ల క్రితం మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా కరకంబాడి మార్గం నుంచి అన్నమయ్య మార్గం పేరిట రహదారి నిర్మాణానికి కార్పొరేషన్ అధికారులు భూసేకరణ చేపట్టారు.అందులో హథీరాంజీ మఠానికి చెందని ఈ భూమి కూడా కొంత ఉంది. అప్పట్లో పరిహారం కింద మఠం అధికారులకే నగరపాలక సంస్థ టీడీఆర్ బాండ్ సైతం అందజేసింది. మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణంతో ఈ భూమి విలువ అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం భూమి రేటు దాదాపు రూ.85 కోట్లకు చేరిపోయింది.

లీజుకు తీసుకుని విక్రయించి!

కొన్నేళ్ల క్రితం ఈ భూమిని స్థానికుడైన ఎం.చెంగారెడ్డి వ్యవసాయం కోసం లీజుకు తీసుకున్నాడు. కొన్నాళ్లపాటు సాగు సైతం చేశాడు. తర్వాత తిమ్మినాయుడుపాళానికి చెందిన మురళి అనే వ్యక్తి విక్రయించేశాడు. కొనుగోలు చేసిన మురళి ఈ భూమిలో కొంత భాగం దుకాణ సముదాయం నిర్మించి అద్దెకు ఇచ్చేశాడు. మిగిలిన భూమిని మళ్లీ చెంగారెడ్డికే లీజుకు ఇచ్చాడు. ఇంతలో మఠం అధికారులు సదరు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు వీలు లేదని చెంగారెడ్డికి తొలుత నోటీసులు జారీ చేశారు. అనంతరం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో లీజు సమయం పూర్తి కావడంతో ఎండోమెంట్ యాక్ట్ 30/87 ప్రకారం సదరు భూమిని లీజుకు తీసుకున్న చెంగారెడ్డిని ఆక్రమణదారుగా ప్రకటించారు.

వ్యాపారం కోసమంటూ ప్రవేశించి..

ఈ మొత్తం వ్యవహారం గమనించిన టీడీపీ స్థానిక నేత నరేష్ ముందుగా సర్పంచ్‌ను కలిసి మురళి భూమిలో కొంత స్థలం ఇప్పించాలని, అందులో గుల్ల, ఇసుక తోలుకుని వ్యాపారం చేసుకుంటానని కోరారు. సర్పంచ్ సూచన మేరకు మురళి సైతం కొంత భూమిని నరేష్‌కు ఇచ్చాడు. అందులో గుల్ల, ఇసుక డంప్ చేసుకుని నరేష్ వ్యాపారం ప్రారంభించాడు. కొన్నాళ్ల తర్వాత సదరు స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి మొత్తం తనదే అంటూ కోర్టులో కేసు వేశాడు. ఇక అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది.

ఆక్రమించుకుంటే చర్యలు

వివాదంగా మారిన భూమిపై ఏడు నెలల క్రితం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశామని మఠం అధికారులు చెబుతున్నారు. అయితే వారు తమకు సహకరించలేదని, మఠం భూమిని ఎవరు ఆక్రమించుకోవాలని చూసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ గెలుపొందగానే దౌర్జన్యం

మఠం భూమిలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా మఠం అధికారులు పెద్దగా పట్టించుకుంది లేదు. కేవలం పోలీసులకు ఫిర్యాదు చేసి మిన్నకుండిపోయారు. దీంతో మొదటి లీజు దారుడు, కొనుగోలుదారుడు, ఆక్రమణదారుడు కుమ్మక్కై వాటాలు వేసేసుకున్నారు. కోర్టులో కేసులు నడుస్తున్నా తమ పనిలో తాము ఉండిపోయారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపొందగానే నరేష్ దౌర్జన్యానికి దిగాడు. మొత్తం భూమిని కాజేసేందుకు రంగంలోకి దిగాదడు. మఠం భూమి తన సొంతమంటూ ఆదివారం జేసీబీలతో వచ్చి మురళి నిర్మించుకున్నషాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చేసేందుకు యత్నించాడు. దుకాణాల ముందు సిమెంట్ ఫ్లోర్‌ను తవ్వేశాడు. అయితే షాపుల యజమానులు తమకు కొంత సమయం ఇవ్వాలని కోరడంతో త్వరలోనే అన్నీ ఖాళీ చేసి వెళ్లిపోవాలని నరేష్ హుకుం జారీ చేశాడు.

ఘనంగా శతాధిక కవి సమ్మేళనం



పుస్తకావిష్కరణలో అతిథులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా 135వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా కమి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఉషారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతలను రూపుమాపేందుకు కవులు ప్రజాపక్షం వహించాలని పిలుపునిచ్చారు. సమాజ మార్పులో కవులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అనంతరం కళావేదిక నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ధనాశి ఉషారాణి రాసిన పద్య పరిమళం పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, మాజీ వీసీ కుసుమకుమారి, కళావేదిక అంతర్జాతీయ గౌరవాధ్యక్షుడు కింగ్ ఇంద్ర, ఆకుల గజేంద్ర, రమావతి, చిట్టే లలిత, గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, పార్థసారధి, బాలార్జున, రాకేష్, గద్దే రాజ్యలక్ష్మి, కళావేదిక జిల్లా అధ్యక్షుడు అరవ జయపాల్, హేమమాలిని, రుక్మిణీరెడ్డి, నాగమణి, రజిని, సుబ్రమణ్యం, స్వరాజ్య లక్ష్మి పాల్గొన్నారు.

సీపీఎస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

తిరుపతి(అలిపిరి): ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికల ఆదివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వంకీపురం పవన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మణికంఠ, ప్రధాన కార్యదర్శిగా మురళీమోహన్ రెడ్డి, అదనపు కార్యదర్శిగా ధరణి కుమార్, కోశాధికారులుగా హేమంత్, గుంటూరు రేఖ, స్టేట్ కౌన్సిలర్–1గా చీర్ల కిరణ్ , స్టేట్ కౌన్సిలర్–2గా భరత్ కుమార్ , స్టేట్ కౌన్సిలర్–3గా గంటా భరత్ , స్టేట్ కౌన్సిలర్–4గా సుబ్బరాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్, వైస్ ప్రెసిడెంట్లుగా మంజునాథ్, చలపతి , సునీల్ కుమార్ యాదవ్ , రంగయ్య, జాయింట్ సెక్రటరీలుగా శ్రీకాంత్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, శ్రీహరి, ఈశ్వర్ నాయక్ ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రేణిగుంట : మండలంలోని కరకంబాడి కట్టపుట్టాలమ్మ ఆలయం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తెలంగాణలోని జడ్చర్లకు చెందిన వల్లపు యాదగిరి(31), అరుణ్‌కుమార్(30), తిరుపతి మంగళం బీటీఆర్ కాలనీకి చెందిన ఎం.మహేష్(38) తిరుపతిలోని రెడ్డిభవన్‌లో పని చేస్తున్నారు. ఈ క్రమంలో మామండూరు ఫారెస్ట్ ఎకో టూరిజం కేంద్రానికి వెళ్లారు. సాయంత్రం బైక్‌పై తిరుపతికి వస్తుండగా లారీ ఢీకొంది. యాదగిరి అక్కడికక్కడే మృతి చెందగా, మహేష్, అరుణ్‌కుమార్ తీవ్రగాయాల పాలయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జున తెలిపారు.

ముక్కంటి ఆలయానికి ప్రచార వాహనం



వాహన తాళం అందిస్తున్న షోరూమ్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం వరుణ్ ట్రక్స్ షోరూమ్ నిర్వాహకులు ప్రచార వాహనం అందించారు. ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు రూ.36లక్షలు విలువైన భారత్ బెంజ్ ప్రచార వాహనాన్ని వరుణ్ ట్రక్స్ ఏజెన్సీ వారి వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారు రూ.10లక్షలు తగ్గించి రూ.26లక్షలకు వాహనం అందించారని వివరించారు. ఈ వాహనం ద్వారా శ్రీకాళహస్తీశ్వరస్వామివారి మహత్యాన్ని రాష్ట్ర నలుమూలలా ప్రచారం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏకాంబరం, మల్లికార్జునప్రసాద్, సతీష్ మాలిక్ పాల్గొన్నారు.

ప్రారంభమైన 'సప్తగిరి సంగీత సప్తాహం'



సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాబృందం

తిరుపతి కల్చరల్ : స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో ఆదివారం సప్తగిరి సంగీత సప్తాహం ప్రారంభించారు. ఏడు రోజులపాటు కొనసాగనున్న ఈ కార్యక్రమాన్ని మనోవికాస్, మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. తొలి రోజు సంగీత విద్యాంసులు కొమండూరు శేషాద్రి కచేరి చేశారు. శాస్త్రీయ భక్తి సంగీత పాటలను సుమధురంగా గానం చేసి సభికులను అలరించారు. అనంతరం డోలు విద్యాంసుడు, ఎస్వీ నాదస్వర పాఠశాల అధ్యాపకు డు వైఎల్ శ్రీనివాసులు, హరిబాబు బృందం వారు మంగళధ్వని అందించారు. ఈ క్రమంలోనే కొల్లూ రు వందన, బి.చిన్నమదేవి గాత్ర కచేరితో ప్రేక్షకులను మైమరిపించారు. వైజాగ్‌కు చెందిన భాగ్యలక్ష్మి బృందం తమ వీణ కచేరితో ఆకట్టుకున్నారు. భీమవరానికి చెందిన ప్రభావతి, తిరుపతికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ శైలేశ్వరి, కాకినాడకు చెందిన ఏ.శ్రీనివాసరాజారావు గాత్ర కచేరీ రంజింపజేసింది. శ్రీవాణి బృందం, చెన్నైకి చెందిన సాకేతరామన్ బృందం వీణ వాయిద్య సంగీతం, భక్తి సంకీర్తనాలాపనతో సభికులు పరవశించారు. అనంతరం కళాకారులను నిర్వాహకుడు మురళీకృష్ణ ఘనంగా సత్కరించారు.